# సాక్షి నల్లగొండ

సోమవారం । 19 । ఫిబ్రవరి । 2024






**బ్రహ్మోత్సవాలకు వేళాయే..**
యాదాద్రిలోని పూర్వగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్స వాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. - 8లో



**సబ్‌స్టేషన్‌లో అగ్ని ప్రమాదం**
భువనగిరి మండలంలోని హన్మాపురం విద్యుత్ సబ్ స్టేషన్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. - 8లో



**యాదాద్రిలో భక్తుల రద్దీ**
యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. - 8లో

## న్యూస్‌రీల్

### నేడు అవగాహన సదస్సు

నల్లగొండ : పీఎం విశ్వకర్మ యోజన పథకంపై సోమవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని ఉదయాదిత్యభవన్‌లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ హరిచందన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు అన్ని మండలాల నుంచి 18 రకాల చేతివృత్తుల వారు హాజరు కావాలని కోరారు. విశ్వకర్మ సంఘం నాయకులు ఈ సదస్సు గురించి సంఘ సభ్యులకు తెలియజేసి సదస్సుకు హాజరయ్యేలా చూడాలని పేర్కొన్నారు.

### రేపు అయోధ్యకు ప్రత్యేక రైలు

నల్లగొండ టూటౌన్ : అయోధ్యలో శ్రీరాముడిని దర్శించుకోవడానికి నల్లగొండ పార్లమెంట్ పరిధిలోని భక్తుల కోసం ఈ నెల 20వ తేదీన ప్రత్యేక రైలు ఏర్పాటు చేసినట్లు బీజేపీ నల్లగొండ కన్వీనర్ బండారు ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అయోధ్యకు వెళ్లాలనుకునే వారు వారి సొంత ఖర్చులతో భువనగిరి రైల్వేస్టేషన్‌కు 20వ తేదీన మధ్యాహ్నం 2 గంటల వరకు చేరుకోవాలని సూచించారు. ఒక వ్యక్తికి రూ.1340 టికెట్ చార్జీ అని, బీజేపీ ఆధ్వర్యంలో వసతి సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు.

### ఎంవీఐల బదిలీ

నల్లగొండ : నల్లగొండ జిల్లాలోని ఆర్‌టీఓ కార్యాలయంలో పనిచేస్తున్న ఎంవీఐ (మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు) బదిలీ అయ్యారు. నల్లగొండ జిల్లాలో పనిచేస్తున్న జి.శ్రీనివాస్‌రెడ్డి, టి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వి.శ్రీనివాస్, జై.చందర్, ఎం.రాములు, అనిల్ చౌహన్, పవన్‌కుమార్ నల్లగొండ నుంచి బదిలీపై వెళ్లారు. వీరి స్థానంలో కొత్త ఎంవీఐలు నల్లగొండకు సోమవారం బదిలీపై రానున్నారు.

### కాంట్రాక్ట్ లెక్చరర్ల అసోసియేషన్ ఎన్నిక

నల్లగొండటౌన్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలల కాంట్రాక్ట్ లెక్చరర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం నల్లగొండలో ఎన్నుకున్నారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చిప్పలపెల్లి అంజయ్య, జాయింట్ సెక్రటరీగా కె.గౌతమ్‌రాథోడ్, ఈసీ మెంబర్‌గా ఎ.మల్లయ్యను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొలిపాక మధు, జనరల్ సెక్రటరీ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

### నేటి నుంచి ఆలిండియా మహిళా కబడ్డీ పోటీలు

గరిడేపల్లి: మండలంలోని గడ్డిపల్లిలో ఆలిండియా మహిళా ఇన్విటేషన్ కబడ్డీ పోటీలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నట్లు గ్రామ మాజీ సర్పంచ్ సుందరి నాగేశ్వరరావు తెలిపారు. కబడ్డీ అసోసియేషన్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రామినేని భూలోకరావుతో కలిసి గ్రామంలో పోటీలకు సంబంధించిన ఏర్పాట్ల ఆదివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. దేశ వ్యాప్తంగా 13 రాష్ట్రాల జట్లు ఈ పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో హరియానా గురుకుల, హరియానా పానిపట్, మహారాష్ట్ర, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, సౌత్ సెంట్రల్ రైల్వేస్, వెస్ట్ బెంగాల్, తెలంగాణ, తమిళనాడు, ఢిల్లీ, ఆర్‌ఎస్ స్పోర్ట్స్ హరియానా, గుజరాత్ జట్లు పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ పోటీలు ఈ నెల 22 వరకు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్స్ కర్లం భద్రయ్య, బచ్చు ఉపేందర్, సంధ్యా, బుక్కయ్య, రమేష్, రామినేని దిలీప్, కర్లం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

### నారసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో ఆదివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి.వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు.. శ్రీస్వామి, అమ్మవారికి సుప్రభాతం సేవ చేపట్టారు. అనంతరం ఆరాధన, నిజాభిషేకం, అర్చన జరిపించారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం శ్రీస్వామి, అమ్మవారి జోడు సేవను ఊరేగించారు. రాత్రి శయనోత్సవం నిర్వహించి ఆలయానిన ద్వార బంధనం చేశారు.



శేషవాహనంపై సేవ నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

## శేషవాహనంపై రామలింగేశ్వరుడు

నార్కట్‌పల్లి : చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో ఆదివారం ఉదయం సూర్య నమస్కారాలు, రుద్రహోమం, బలిహారణ, ఏకాదశ రుద్రాభిషేకం, మహానివేదన పూజ వైభవంగా నిర్వహించారు. అనంతరం శేసవామనంపై స్వామివారి సేవను ఊరేగించారు. పూజా కైంకర్యాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో దేవాలయ ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ, శ్రీకాంత్‌శర్మ, సురేశ్‌శర్మ, సతీష్‌శర్మ, దేవాలయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మహేంద్రకుమార్, ఈఓ నవీన్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్లు ఇంద్రసేనారెడ్డి, శంకర్, శ్రీనివాస్‌రెడ్డి, రాజయ్య, నర్సిరెడ్డి, వెంకటయ్య, వంశీదర్‌రావు, రాజ్యలక్ష్మి, లక్ష్మణ్, నరేష్ తదితరులు ఉన్నారు.

# ప్రాణాలకు ఖరీదు..!

- రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న పలువురు వైద్యులు
- గ్యాంగులను పెంచి పోషిస్తున్న ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యం
- వైద్యుడి నిర్లక్ష్యంతో మృతిచెందిన వారి కుటుంబాలకు డబ్బుతో గాలం
- పట్టించుకోని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు



మిర్యాలగూడలో ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న రోగి బంధువులు (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్ : ఆరోగ్యం బాగా లేక ఆస్పత్రికి వస్తే.. వచ్చిన రోగం పోవడం దేవుడెరుగు.. అసలు ప్రాణమే లేకుండా పోతే..! ఆ ప్రాణానికి ఖరీదు కట్టి చేతులు దులుపుకుంటున్నారు కొందరు ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు. పెద్ద మనుషులుగా చెలామణి అవుతున్న వారు సైతం వైద్యులకే వత్తాసు పలుకుతూ బాధిత కుటుంబాల్లో కన్నీరు మిగిలిస్తున్నారు. ఒక్కోసారి రోగులు, వారి బంధువులను సైతం బెదిరించి విషయం బయటికి పొక్కకుండా పెద్ద మనుషులు (రౌడీ షీటర్లు) ఆయా ఆస్పత్రులకు అండగా నిలుస్తున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు వారిని పెంచి పోషిస్తున్నారని ప్రజలకు తెలిసిన విషయమే. అనేక చావులను బయటికి రానీయకుండా ప్రాణాలకు ఖరీదు కట్టి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న వీరికి అడ్డుకట్ట వేయాల్సిన జిల్లా వైద్యాధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో రోగి మృతిచెందడంతో ఆందోళన చేస్తున్న బంధువులు (ఫైల్)

**వైద్యుల నిర్లక్ష్యాన్ని తెలిపే ఘటనలు ఇలా..**

- దామరచర్ల మండలం ఇర్కిగూడెం గ్రామానికి చెందిన దాసరి యల్లయ్య తన కూతురు మీనాక్షి (9)తో కలిసి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. ఈ నెల 14వ తేదీన మిర్యాలగూడ పట్టణంలోని రెడ్డీకాలనీలో గల ఓ వైద్యశాలకు తీసుకొచ్చారు. బాలికలను పరీక్షించిన ఎముకల వైద్యుడు కాలికి ఆపరేషన్ చేయాలని థియేటర్‌కు తీసుకెళ్లి ఎముకల వైద్యుడే మత్తు మందు ఇచ్చాడు. కొద్ది సేపటికే బాలిక అపస్మారక స్థితిలోకి పోవడంతో ఆపరేషన్ థియేటర్ నుంచి బయటకు వచ్చిన వైద్యుడు బాలిక పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తీసుకెళ్లాలని చెప్పి స్వయంగా అంబులెన్స్ ఏర్పాటు చేసి హడావుడిగా వారిని హైదరాబాద్ తరలించి ఆస్పత్రికి తాళం వేసి వెళ్లిపోయాడు. హైదరాబాద్‌కు తీసుకెళ్లే సరికి ఆ బాలిక మృతిచెందింది. వెంటనే పెద్ద మనుషులు రంగంలోకి దిగి బాలిక ప్రాణానికి రూ.5లక్షలు ఖరీదు కట్టారు.
- గత సంవత్సరం ఆగస్టు 30న త్రిపురారం మండలం రేగులగడ్డ గ్రామానికి చెందిన మాతంగి రాధ (38) కడుపునొప్పితో బాధపడుతూ మిర్యాలగూడ పట్టణంలోని డాక్టర్స్ కాలనీలో గల ఓ మల్టీసెపషాలిటీ ఆస్పత్రికి వచ్చింది. ఆమెను పరీక్షించిన సదరు వైద్యుడు ఆపరేషన్ చేసి గర్భసంచి తొలగించారు. వారంరోజుల తరువాత డిశ్చార్జి అయి ఇంటికి వెళ్లిన రాధకు తీవ్ర రక్తస్రావం కావడంతో భయపడిన కుటుంబ సభ్యులు తిరిగి ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆమెను పరీక్షించిన సదరు వైద్యుడు వైద్య సేవలు ప్రారంభించారు. అయినప్పటికీ మహిళ ఆరోగ్యం బాగు పడకపోగా మరింత క్షీణించింది. దీంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తీసుకెళ్లాలని సూచించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో నల్లగొండకు తరలించి చికిత్స అందిస్తుండగా ఆమె మృతి చెందింది. కాగా పెద్ద మనుషుల జోక్యంతో మృతురాలి కుటుంబానికి రూ.3 లక్షలు ఇచ్చారు.

**ప్రైవేట్ ఆస్పత్రుల్లో నిబంధనలకు నీళ్లు..**

అన్నీ మావే.. అంతా మాకే.. అన్నట్లుగా ఉంది మిర్యాలగూడలో వైద్యులు తీరు. ఆస్పత్రులతోపాటు ల్యాబ్, మెడికల్ షాప్ వంటి వ్యాపారాలన్నీ వారే ఏర్పాటు చేసుకుని ఎలాంటి అర్హత లేని సిబ్బందిని పనిలో పెట్టుకుని రోగుల జేబులు గుల్ల చేస్తున్నారు. ఏదైనా రోగం వచ్చిందని వైద్యుడి వద్దకు వెళ్తే.. అవసరం లేకపోయినా అన్ని రకాల పరీక్షలు రాసి తమవద్దే చేయించుకోవాలని వారిని ఒత్తిడికి గురి చేస్తున్నారని రోగులు బంధువులు ఆరోపిస్తున్నారు. తమకు నచ్చిన విధంగా ల్యాబ్ నుంచి రిపోర్టులు రాయించుకుని ఏ జబ్బూ లేకున్నా వేల రూపాయల మందులు తమ సొంత మెడికల్ షాపుల ద్వారా అంటగడుతున్నారనే విమర్శలు లేకపోలేదు. ఇప్పటికైనా జిల్లా వైద్యాధికారులు స్పందించి ప్రభుత్వ నిబంధనలను ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యం పాటించేలా చర్యలు తీసుకోవడంతో పాటు అకారణంగా రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న వైద్యులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# పాతాళానికి గంగమ్మ

- గతేడాది జనవరితో పోలిస్తే.. సగానికి పడిపోయిన భూగర్భ జలాలు
- తీవ్ర వర్షాభావంతో 16 మీటర్ల లోతులోకి..
- వట్టిపోతున్న బోరుబావులు
- వేసవిలో తాగునీటికి కష్టాలు ఏర్పడే ప్రమాదం



నల్లగొండ : వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భ జలాల్ప నానాటికీ అడుగంటుతున్నాయి. గత సంవత్సరం జనవరితో పోలిస్తే ఈసారి సగానికి సగం పడిపోయాయి. 2023 జనవరిలో అధికంగా చందంపేట మండలంలో 7 మీటర్లపైన ఉన్న భూగర్భ జలాలు ఇప్పుడు 16 మీటర్ల లోతుకు పడిపోయాయి. ఇదే పరిస్థితి జిల్లా అంతటా ఉంది. చాలా చోట్ల బోర్లు వట్టిపోయాయి. ఇదే పరిస్థితి కొనసాగితే వేసవిలో మహబూబ్‌నగర్, ఖమ్మం, నల్లగొండ జిల్లాలతో పాటు హైదరాబాద్ నగరాలకు తాగునీటికి ఇక్కట్లు తప్పేలా లేవనిపిస్తోంది.

**ఎండిపోతున్న వరి పొలాలు**

ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటల సాగు కూడా అంతంత మాత్రంగానే ఉంది. సాగర్ ఆయకట్టులో సాగుకు నీటిని విడుదల చేయలేదు. ఏఎమ్మార్పీ కింద తాగు నీటిని వదలడంతో ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు కాస్త పెరిగాయి. ప్రస్తుతం చెరువులు, కుంటల్లో నీరు లేకపోవడంతో భూగర్భ జలాలు తగ్గిపోయి బోరు బావుల్లో నీరు తగ్గింది. దీంతో యాసంగిలో సాగు చేసిన వరి పొలాలు ఎండిపోతున్నాయి.

మండలాల వారీగా భూగర్భ జలాలు (మీటర్ల లోతులో) ఇలా..

| మండలం | 2023 జనవరి | 2024 జవవరి |
|---|---|---|
| చందంపేట | 7.096 | 15.62 |
| చింతపల్లి | 4.96 | 9.53 |
| దేవరకొండ | 4.74 | 8.00 |
| గుండ్లపల్లి | 3.87 | 4.86 |
| గుర్రంపోడు | 2.80 | 6.58 |
| కొండమల్లేపల్లి | 3.94 | 6.26 |
| మర్రిగూడ | 5.56 | 9.01 |
| నాంపల్లి | 6.66 | 10.68 |
| నేరడుగొమ్ము | 7.92 | 12.85 |
| పీఏపల్లి | 4.04 | 5.68 |
| అడవిదేవులపల్లి | 6.84 | 8.29 |
| అనుముల | 4.75 | 9.33 |
| దామరచర్ల | 0.96 | 4.70 |
| మాడ్గులపల్లి | 4.28 | 7.02 |
| మిర్యాలగూడ | 2.79 | 7.76 |
| నిడమనూరు | 5.28 | 8.04 |
| పెద్దవూర | 3.26 | 10.25 |
| తిరుమలగిరి సాగర్ | 4.45 | 7.21 |
| త్రిపురారం | 3.58 | 7.80 |
| వేములపల్లి | 5.26 | 7.24 |
| చండూరు | 7.04 | 10.25 |
| చిట్యాల | 7.15 | 12.30 |
| కనగల్ | 5.06 | 5.91 |
| కట్టంగూర్ | 5.89 | 9.88 |
| కేతేపల్లి | 6.57 | 10.48 |
| మునుగోడు | 4.44 | 6.06 |
| నకిరేకల్ | 4.05 | 7.47 |
| నల్లగొండ | 4.05 | 7.79 |
| నార్కట్‌పల్లి | 5.39 | 8.46 |
| శాలిగౌరారం | 5.30 | 6.68 |
| తిప్పర్తి | 4.56 | 7.12 |
| గట్టుప్పల్ | 4.2 | 6.33 |

## కాంగ్రెస్‌లో కృష్ణారెడ్డి చేరిక చెల్లదు

- యాదాద్రి డీసీసీ అధ్యక్షుడు సంజీవరెడ్డి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : బీజేపీలో కొనసాగుతున్న చలమల్ల కృష్ణారెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులకు సమాచారం ఇవ్వకుండా గాంధీభవన్‌లో కండువా కప్పుకుని తాను కాంగ్రెస్ పార్టీలో చేరానని చెప్పుకుంటున్నాడని.. ఆయన చేరికను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా తాను పూర్తిగా ఖండిస్తున్నానని యాదాద్రి భువనగిరి డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చలమల్ల కృష్ణారెడ్డి చెప్పుకుంటున్న మాటలను ఏ ఒక్క కాంగ్రెస్ కార్యకర్త, నాయకుడు పరిగణలోకి తీసుకోవద్దని సూచించారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చే సమయంలో స్వలాభం కోసం పార్టీని వీడి బీజేపీలో చేరారని.. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు కాకుండా అడ్డుకునేందుకు కోట్ల రూపాయలు ఖర్చు చేసిన కృష్ణారెడ్డి తిరిగి ఏ ముఖం పెట్టుకుని కాంగ్రెస్ పార్టీ అని చెప్పుకుంటున్నాడని ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నిత్యం పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు అహర్నిశలు కృషి చేసిన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డితోపాటు ఉమ్మడి జిల్లా నేతలపైన వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జానారెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని దుర్భాషలాడిన మూర్ఖుడు చలమల్ల కృష్ణారెడ్డి అని పేర్కొన్నారు. అలాంటి వ్యక్తి నేడు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తన బ్లాక్ దందాలను కొనసాగించేందుకు తన అక్రమ సంపాదనలు కాపాడుకునేందుకు తాను కాంగ్రెస్ పార్టీ అని చెప్పుకుంటున్నాడని ఆరోపించారు. కాంగ్రెస్‌లో చేరారని చెప్పుకుంటున్న కృష్ణారెడ్డిని గ్రామాల్లో ఎక్కడ తిరిగినా నిలదీయాలని పేర్కొన్నారు. ఎవరైనా పార్టీలో చేరితే స్థానిక ఎమ్మెల్యే, జిల్లా మంత్రితో పాటు ఉన్నత నాయకులకు సమాచారం ఇచ్చి చేరుతారని, కానీ కృష్ణారెడ్డి అలా కాకుండా దొంగ చాటున హైదరాబాద్‌కు చెందిన కొందరు నాయకులు గాంధీభవన్‌లో చేరుతుంటే క్యూలైన్లో నిలబడి కండువా కప్పించుకున్నాడని ఆరోపించారు. చలమల్ల చేరిక చెల్లదని ఈ విషయాన్ని ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ కార్యకర్తలు గమనించాలని సంజీవరెడ్డి కోరారు.

## అంబులెన్స్‌ల పేరుతో రూ.లక్షల్లో స్వాహా

- మూడు సంవత్సరాలుగా కొనసాగుతున్న వ్యవహారం
- లోతుగా విచారణ జరపాలని పలువురి డిమాండ్



నల్లగొండ టౌన్ : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అక్రమాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. ఇటీవల మెడికల్ ఏజెన్సీ నిర్వాహకుల నుంచి రూ.3 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన సూపరింటెండెంట్ లచ్చునాయక్ అవినీతి చిట్టా రోజుకొకటి బయట పడుతోంది. తాజాగా గత మూడేళ్లుగా మూలకుబడ్డ అంబులెన్స్‌లను నిర్వహిస్తున్నట్లుగా బిల్లులు పెట్టి లక్షలాది రూపాయల స్వాహా చేసినట్టు తెలిసింది. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నుంచి ఎలాంటి రిఫరల్ కేసులు లేకున్నా.. ఆ అంబులెన్స్‌లను నడిపినట్లు అందుకు డ్రైవర్ వేతనం, డీజిల్ ఖర్చు, వాహనం నిర్వహణకు నెలకు రూ.40 నుంచి రూ.50 వరకు మూడు సంవత్సరాలుగా బిల్లులు పొందుతున్నట్లు తెలిసింది. అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీకి చెందిన డ్రైవర్ పేరుతో ప్రతినెల ఆ బిల్లులను డ్రా చేసి అంతా ఆయన ఖాతాలో జమ చేసుకుంటున్నట్లు సమాచారం. ఇలా ఇప్పటి వరకు రూ.15 లక్షలకు పైగా స్వాహా చేసినట్లు తెలిసింది.

**రూ.3 కోట్ల అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ!**

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఇటీవల రాష్ట్ర ఆడిట్ కమిటీ ఆడిట్ చేసిన సమయంలో అంబులెన్స్‌ల నిర్వహణతోపాటు పలు అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. అప్పట్లో 15 రోజులు ఆసుపత్రిలో మకాం వేసిన ఆడిట్ చేసిన బృందం దాదాపు రూ.3 కోట్ల వరకు అక్రమాలు జరిగినట్టు నిర్ధారించింది. దాన్ని కప్పిపుచ్చుకోవడానికి సూపరింటెండెంట్ లచ్చునాయక్ డైట్ కాంట్రాక్టర్, అవుట్‌సోర్సింగ్ కాంట్రాక్టర్, శానిటేషన్ కాంట్రాక్టర్ నుంచి రూ.10 లక్షల చొప్పున వసూలు చేసి సంబంధిత ఆడిట్ అధికారులకు ఇచ్చి వారిని కూడా ఆయన కనుసన్నల్లో పెట్టుకున్నట్లు సమాచారం. అయితే ఇటీవల రూ.3 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కడంతో లచ్చునాయక్ అక్రమాలు రోజుకొకటి చొప్పున బయటికొస్తున్నాయి. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో అంబులెన్స్‌లు నడపకపోయినా నడిపినట్లు బిల్లులు స్వాహా చేసిన వ్యవహారంపై వివరణ కోరడానికి ప్రస్తుత సూపరింటెండెంట్ నిత్యానందంను ఫోన్‌లో సంప్రదించగా.. ఆయన స్పందించలేదు.

# నేడు గవర్నర్ తమిళిసై రాక



వెల్లంకిలోని కూరెళ్ల గ్రంథాలయంలో పుస్తకాలు

- ఆచార్య కూరెళ్ల గ్రంథాలయానికి ప్రారంభోత్సవం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ కె.లక్ష్మణ్



రామన్నపేట : రాష్ట్ర గవర్నర్ తమిళి సై సౌందర రాజన్ సోమవారం రామన్నపేట మండలంలోని వెల్లంకి గ్రామానికి రానున్నారు. పద్మశ్రీ డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య తన స్వగ్రామంలో రెండు లక్షల పైచిలుకు పుస్తకాలతో ఏర్పాటు చేసిన ఆచార్య కూరెళ్ల గ్రంథాలయాన్ని ఆమె ప్రారంభించనున్నారు.అనంతరం విఠలాచార్య రాసిన కూరెళ్ల శతకం ద్వితీయ ముద్రణను ఆవిష్కరించనున్నారు. గవర్నర్ పర్యటనకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

**ఐదు వేల పుస్తకాలతో మొదలై..**

కూరెళ్ల విఠలాచార్య 35 సంవత్సరాలు ఉపాధ్యాయుడిగా, తెలుగు ఉపన్యాసకులుగా పనిచేశారు. ఉద్యోగ విరమణ అనంతరం వెల్లంకిలో తాను నివాసం ఉంటున్న ఇంటిలో 2014 ఫిబ్రవరి 13వ తేదీన 5వేల పుస్తకాలతో ఆచార్య కూరెళ్ల పేరుతో గ్రంథాలయం ఏర్పాటు చేశారు. గ్రంథభిక్ష పేరుతో పుస్తక సేకరణ చేపట్టారు. క్రమంగా గ్రంథాలయంలో పుస్తకాల సంఖ్య గణనీయంగా పెరిగింది. దీంతో తన ఇంటిని కూలగొట్టి అదేస్థలంలో డాక్టర్ కూరెళ్ల ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.2 కోట్ల వ్యయంతో రెండు అంతస్తుల్లో నూతన భవనం నిర్మించారు. ప్రస్తుతం గ్రంథాలయంలో పుస్తకాల సంఖ్య రెండు లక్షలు దాటింది. కూరెళ్ల గ్రంథాలయాన్ని ప్రధాని నరేంద్రమోదీ మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రశంసించారు. ఆయన సేవలకు గుర్తుగా రాష్ట్ర ప్రభుత్వం దాశరథి పురస్కారం ప్రదానం చేసింది. కేంద్రప్రభుత్వం పద్మశ్రీ పురస్కారానికి ఎంపిక చేసింది.

**హాజరుకానున్న ప్రముఖులు**

గ్రంథాలయాన్ని గవర్నర్ ప్రారంభించిన అనంతరం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కూనూరు లక్ష్మణ్ అధ్యక్షతన సభ నిర్వహించనున్నారు. ఈ సభకు కలెక్టర్ హనుమంతు కే.జెండగే, ఆస్కార్ అవార్డు గ్రహీత, ప్రముఖ సినీగేయ రచయిత కె.సుభాస్‌చంద్రబోస్ హాజరు కానున్నారు. మధ్యాహ్నం జరిగే సాహిత్య సదస్సుకు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ముఖ్య అతిథిగా విచ్చేసున్నారు. డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, డాక్టర్ రఘు, డాక్టర్ బెల్లి యాదయ్య, డాక్టర్ క్రిష్ణకౌండిన్య, డాక్టర్ దాసోజు పద్మావతి ప్రసంగించనున్నారు.

**ఏర్పాట్ల పరిశీలన**

గవర్నర్ రాక సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏర్పాట్లను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్ ఆదివారం పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఆయన వెంట అడిషనల్ ఎస్పీ లక్ష్మీనారాయణ, తహసీల్దార్ లాల్‌బహదూర్, ఎంపీడీఓ యాకుబ్, సీఐ వెంకటేశ్వర్లు, ఎంపీఓ అంజిరెడ్డి ఉన్నారు.

### గవర్నర్ పర్యటనను విజయవంతం చేయాలి



జన్మభూమి రుణం తీర్చుకోవాలనే సంకల్పంతో గ్రంథాలయం ఏర్పాటు చేశా. విజ్ఞాన సంపదను భావితరాలకు అందించాలనే లక్ష్యంతో లక్షల పుస్తకాలను సేకరించి అందుబాటులో ఉంచాను. దాతలు, సహృదయుల సహకారంతో మంచి భవనం నిర్మించాం. గ్రంథాలయ ప్రారంభోత్సవ వేడుక నా జీవితంలో అత్యంత ప్రముఖమైన ఘట్టం. సాహితీప్రియులు అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలి.

-డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య

### గవర్నర్ పర్యటన షెడ్యూల్

గవర్నర్ పర్యటన షెడ్యూల్‌ను కలెక్టర్ హనుమంతు కే.జెండగే వెల్లడించారు. సోమవారం ఉదయం 11.30కి హైదరాబాద్ నుంచి బయలుదేరి మధ్యాహ్నం ఒంటి గంటలకు వెల్లంకి గ్రామానికి గవర్నర్ చేరుకుంటారు. అనంతరం గ్రంథాలయాన్ని ప్రారంభించి ప్రజలనుద్దేశించి మాట్లాడుతారు. 2 గంటలకు హైదరాబాద్ బయలుదేరి వెళ్తారని కలెక్టర్ పేర్కొన్నారు.

## విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తాం



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు



విద్యార్థుల ప్రదర్శన

నల్లగొండ : ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు యూత్ ఫర్ సేవ ఆధ్వర్యంలో ఉచితంగా ట్యూషన్ సౌకర్యం కల్పించడంతో పాటు స్టడీ మెటీరియల్ అందిస్తామని నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి జూనియర్ కళాశాలలో యూత్ ఫర్ సేవ ఆధ్వర్యంలో ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన చిగురు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చిన్నప్పటి నుంచే విద్యార్థులను సంస్కారవంతులుగా తీర్చిదిద్దుతూ దేశభక్తి నేర్పిస్తూ, సమాజంపై అవగాహన, కుటుంబ విలువలు నేర్పించే బాధ్యత తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులపై ఉందన్నారు. చిగురు కార్యక్రమంలో 24 ప్రభుత్వ పాఠశాలల నుంచి 600 మంది విద్యార్థులు పాల్గొనడం విశేషమన్నారు. అనంతరం విద్యార్థులు ఆయా పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గోన గన్నారెడ్డి, నిర్వాహకులు మెగావత్ స్వామినాయక్, స్వరూప, సునీల్, వెంకట్, తిరుపతి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### మంత్రిపై తప్పుడు పోస్టు పెట్టిన వ్యక్తి అరెస్ట్

**కోదాడ:** సామాజిక మాధ్యమాల్లో రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టుపెట్టిన వ్యక్తిని శనివారం రాత్రి అరెస్ట్ చేసినట్లు కోదాడ సీఐ రాము తెలిపారు. కోదాడకు చెందిన రైస్ మిల్లర్ నీలా సత్యనారాయణ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఎంపీగా ఉన్న సమయంలో తన మిల్లుకు సీఎంఆర్ ధాన్యం కేటాయించాలని కలెక్టర్‌కు ఒక లేఖ ద్వారా రికమండ్ చేసినట్లు వాట్సాప్ గ్రూప్‌లో ఈ నెల 3న పోస్టు పెట్టాడు. తాను అలాంటి లెటర్ ఏదీ ఇవ్వలేదని మంత్రి స్పష్టం చేయడంతో పాటు ఈ పోస్టు మంత్రి ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా ఉందని కోదాడకు చెందిన గింజల రమణారెడ్డి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు నీలా సత్యనారాయణను శనివారం రాత్రి అరెస్ట్ చేసి న్యాయమూర్తి ముందు హాజరుపర్చగా ఆయనకు వ్యక్తిగత పూచీకత్తుపై బెయిల్ మంజూరు చేసినట్లు సీఐ తెలిపారు.

### ఆటో ఢీకొని దుర్మరణం

**బొమ్మలరామారం:** ట్రాలీ ఆటో ఢీ కొని ఓ వ్యక్తి మృతిచెందాడు. బొమ్మలరామారం మండలం ప్యారారం గ్రామానికి చెందిన చింతల చంద్రయ్య (63) అదే గ్రామానికి చెందిన తన సోదరుడైన చింతల అశోక్ ఇంటికి శనివారం రాత్రి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో తుర్కపల్లి మండలం మోతీరాంతండాకు చెందిన బానోత్ విఠల్ తన ట్రాలీ ఆటోను అతివేగంగా నడుపుకుంటూ వచ్చి చింతల చంద్రయ్యను వెనక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో చంద్రయ్యకు తీవ్ర గాయాలవడంతో భువనగిరి జిల్లా ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరిశీలించి అప్పటికే చంద్రయ్య మృతిచెందాడని ధ్రువీకరించారు. మృతుడి కుమారుడు ఖాసీం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

### చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

**హుజూర్‌నగర్ :** ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. హుజూర్‌నగర్‌లోని గోవిందాపురానికి చెందిన కామళ్ల గోపి (32) పట్టణంలోని వాటర్ ప్లాంట్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొన్ని రోజులుగా వ్యక్తిగత విషయాలను మనసులో పెట్టుకొని తనలో తనే బాధపడుతుండే వాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు.అక్కడ చికిత్స పొందుతున్న గోపి ఆదివారం సాయంత్రం మృతిచెందాడు. మృతుడి తండ్రి సుందర్ రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

### మేడారం వెళ్తూ గుండెపోటుతో వ్యక్తి మృతి

**కూసుమంచి:** స్నేహితులతో కలిసి మేడారం జాతరకు బయలుదేరిన ఓ వ్యక్తి గుండెపోటుతో మృతిచెందిన ఘటన ఆదివారం మండలంలో ఈశ్వరమాధారం వద్ద చోటుచేసుకుంది. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన ఎనిమిదిమంది స్నేహితులు నాలుగు ద్విచక్ర వాహనాలపై మేడారం జాతరకు వెళ్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని ఈశ్వరమాధారం సమీపంలోని బ్రిడ్జి వద్దకు భిక్షం (49)కు హఠాత్తుగా గుండెపోటు వచ్చింది. మిగిలినవారు ఆయన్ను ఆస్పత్రికి తరలించేలోగా అక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనతో స్నేహితులు విషాదంలో మునిగిపోగా భిక్షం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. కాగా, ఈ ఘటనపై తమకు ఎలాంటి సమాచారం అందలేదని పోలీసులు తెలిపారు.

# పూర్వగిరీశుడి బ్రహ్మోత్సవాలకు వేళాయె

- నేటి నుంచి ఉత్సవాలు
- 22న స్వామివారి తిరు కల్యాణం

**యాదగిరిగుట్ట:** యాదాద్రిలో పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం నుంచి ఈ నెల 25వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలను ఆగమశాస్త్ర ప్రకారం అంగరంగ వైభవంగా నిర్వహించేలా ఇప్పటికే అటు అధికారులు, ఇటు అర్చక బృందం సర్వం సిద్ధం చేసుకున్నారు. ఆలయ సన్నిధిలో ఇప్పటికే చలువ పందిళ్లు, ఆలయ ముఖ మండపంలో యాగశాలను ఏర్పాటు చేశారు. కల్యాణ మండపానికి, రథానికి, వేంచేపు మండపానికి రంగులు వేసి సిద్ధం చేశారు. ఆలయంలో విద్యుత్ దీపాలతో పాటు మామిడి, అరటి తోరణాలతో తీర్చిదిద్దారు.

**స్వస్తి వాచనంతో ఉత్సవాలకు శ్రీకారం..**

పూర్వగిరి ఆలయంలో సోమవారం ఉదయం 10గంటలకు స్వస్తి వాచనంతో ఆచార్యులు బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తారు. విశ్వక్సేనారాధాన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం నిర్వహిస్తారు. సాయంత్రం 6గంటలకు మృత్సంగ్రహణం, అంకురారోపణం చేస్తారు. 20వ తేదీన ఉదయం 10గంటలకు ధ్వజారోహణం, హోమం, వేద పారాయణం చేపడతారు. అదే రోజు సాయంత్రం 6గంటలకు భేరీపూజ, దేవతాహ్వానం నిర్వహిస్తారు. 21వ తేదీన వాహన, అలంకార సేవలకు శ్రీకారం చుడతారు. ఉదయం 10గంటలకు సింహ వాహన సేవ, సాయంత్రం 6గంటలకు హోమం నిర్వహించి, అనంతరం అశ్వవాహన అలంకార సేవను జరిపిస్తారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్ల ఎదుర్కోలు



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన పాత గుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం

ఉత్సవాన్ని ఆలయ ముఖ మండపంలో నిర్వహిస్తారు. 22వ తేదీన 10గంటలకు తిరుమంజనం, శ్రీహనుమంత వాహన అలంకార సేవ, రాత్రి 6గంటలకు హోమం జరిపిస్తారు. అనంతరం 8గంటలకు గజవాహన సేవపై స్వామివారిని పురవీధుల్లో ఊరేగించి, కల్యాణ మండపంలో శ్రీస్వామి అమ్మవార్ల తిరు కల్యాణ మహోత్సవాన్ని పాంచరాత్ర ఆగమశాస్త్రానుసారంగా నిర్వహిస్తారు. 23వ తేదీన ఉదయం 10 గంటలకు శ్రీగరుఢ వాహన అలంకార సేవ జరిపించి, సాయంత్రం 6గంటలకు ఆలయ ఆవరణలో రథాంగ హోమం నిర్వహించి, 8గంటలకు దివ్యవిమాన రథోత్సవాన్ని భక్తుల మధ్యన ఊరేగిస్తారు. 24వ తేదీన ఉదయం 10.30గంటలకు మహాపూర్ణాహుతి, మధ్యాహ్నం 12 గంటలకు చక్ర తీర్థ స్నానం నిర్వహిస్తారు. సాయంత్రం 6గంటలకు దేవతోద్వాసన, శ్రీపుష్పయాగం, ద్వాదశారాధన, డోలోత్సవం జరిపిస్తారు. 25వ తేదీన 10గంటలకు అష్టోత్తర శతఘటాభిషేకం, మధ్యాహ్నం 12.30గంటలకు మహదాశీర్వచనం, పండితసన్మానం నిర్వహించి ఉత్సవాలను ముగిస్తారు.



కల్యాణోత్సవానికి సిద్ధం చేసిన కల్యాణ మండపం

**మొక్కు కల్యాణోత్సవాలు రద్దు..**

వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో 15వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఆలయంలో భక్తులచే నిర్వహించే మొక్కు కల్యాణోత్సవాలు రద్దు చేశారు. 23వ తేదీన రథోత్సవం సందర్భంగా రాత్రి ఆర్జిత సేవలు, అర్చనలు, భోగములు వంటి సేవలను నిలిపివేస్తారు. 24వ తేదీన చక్రతీర్థం, 25వ తేదీన అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించనున్న నేపథ్యంలో ఆర్జిత అభిషేకాలు, అర్చనలు బంద్ చేశారు. 22వ తేదీన నిర్వహించే స్వామివారి తిరు కల్యాణ మహోత్సవంలో పాల్గొనే భక్తులు రూ.600 టికెట్ కొనుగోలు చేయాల్సి ఉంటుందని అధికారులు వెల్లడించారు. ఇక 25వ తేదీన అష్టోత్తర శతఘటాభిషేకం ఉన్న సందర్భంగా రూ.250 టికెట్ కొనుగోలు చేసి పాల్గొనవచ్చునని, ఇందులో ఇద్దరికి మాత్రమే ప్రవేశమని ఆలయాధికారులు వెల్లడించారు.

## యాదాద్రి ఆలయంలో భక్తుల రద్దీ

**యాదగిరిగుట్ట:** యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం సెలవు రోజు కావడంతో భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, బస్టాండ్ వంటి ప్రాంతాల్లో భక్తులు ఎక్కువగా కనిపించారు. భక్తులు అధికంగా రావడంతో స్వామివారి ధర్మదర్శనానికి రెండున్నర గంటలు, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టింది. స్వామివారిని 30వేల మందికి పైగా భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ పూజలతో నిత్యాదాయం రూ.35,52,253 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.



క్యూలైన్‌లో బారులుదీరిన భక్తులు

### ఆలయ వీధుల్లో బూట్లతో పోలీస్ కానిస్టేబుల్

యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి ప్రధానాలయం పరిసరాలకు వచ్చే భక్తులు పాదరక్షలు దూరంగా వదిలేసి రావాలని అధికారులు చెబుతున్నారు. కానీ ఆదివారం కొండపైకి వచ్చిన పోలీస్ కానిస్టేబుల్ మాత్రం ఆలయ వీధుల్లో షూ వేసుకొని ప్రసాదాలు తీసుకొని నడుచుకుంటూ వెళ్తున్నారు. పోలీసులకు నిబంధనలు వర్తించవా అని కొందరు భక్తులు అంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, యాదాద్రి భువనగిరి జిల్లా



ఆలయ వీధుల్లో షూ వేసుకొని ఉన్న పోలీస్ కానిస్టేబుల్

### ప్రయాణికుడి కునికిపాటు.. ఆకలి తీర్చుకుంటున్న కోతి

భువనగిరి రైల్వే స్టేషన్‌లో ఆదివారం ఓ ప్రయాణికుడు హైదరాబాద్‌కు వెళ్లే రైలు కోసం ఎదురుచూస్తూ అక్కడే ప్లాట్‌ఫాంపై కునుకు తీశాడు. ఇంతలో ఆకలితో ఉన్న ఓ కోతి అక్కడకు వచ్చి కునుకు తీస్తున్న ప్రయాణికుడు వద్దకు వచ్చి అతడి పక్కన ఉన్న బ్రెడ్డు ప్యాకెట్‌లోని బ్రెడ్డు తినడం ప్రారంభించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, యాదాద్రి భువనగిరి జిల్లా





### పులి బొమ్మ రక్షణ

భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన జింకల నాగలక్ష్మి కోతుల బాధతో విసుగుచెంది హైదరాబాద్‌లో రూ.2వేలు వెచ్చించి పులి బొమ్మను కొనుగోలు చేసింది. ఆ పులిబొమ్మను తన ఇంటి గుమ్మం ముందు ఉంచింది. దీంతో కోతులు పులిబొమ్మను చూసి భయపడి పారిపోతున్నాయి. కుక్కలు సైతం ఇంటి సమీపంలోకి రావాలంటే భయపడి పోతున్నాయని, పులిబొమ్మ ఇంటికి రక్షణగా నిలిచిందని ఆమె తెలిపింది.

– భూదాన్‌పోచంపల్లి

### ఉరేసుకుని వలస కార్మికుడు బలవన్మరణం

**భూదాన్‌పోచంపల్లి :** మద్యానికి బానిసై, ఆపై ఒంటరి జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరివేసుకొని వలసకార్మికుడు బలవర్మణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన భూదాన్‌పోచంపల్లి మండలం దోతిగూడెం గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకొంది. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓంప్రకాశ్ (39) 18 ఏళ్ల క్రితం కూలిపని నిమిత్తం దోతిగూడేనికి వలస వచ్చి గది అద్దెకు తీసుకొని నివసిస్తున్నాడు. గ్రామ సమీపంలోని ఎస్‌వీఆర్ కంపనీలో కార్మికుడిగా పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. కొంత కాలంగా మద్యానికి బానిసైన ఓంప్రకాశ్ ఒంటరి జీవితంపై విరక్తి చెంది ఆదివారం సాయంత్రం తాను ఉంటున్న గదిలో ఇంటి పైకప్పు ఇనుప రాడ్డుకు తాడుతో ఉరివేసుకొని బలవర్మణానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకొన్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

### నిజాయితీ చాటుకున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు

- పోగొట్టుకున్న సొత్తు బాధితురాలికి అప్పగింత

**హాలియా:** పోగొటుకున్న సొత్తును బాధితురాలికి తిరిగి అప్పగించి ఓ ఉపాధ్యాయుడు నిజాయితీ చాటుకున్నాడు. తిరుమలగిరి(సాగర్) మండలంలోని రంగుండ్ల గ్రామానికి చెందిన బొడ్డు గీత పని నిమిత్తం శనివారం హాలియా పట్టణానికి వచ్చింది. ఈ క్రమంలో తన వెంట తెచ్చుకున్న నగదు రూ.33వేలు దారిలో జారిపోవడంతో సదరు మహిళ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అదే సమయంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న హాలియాకు చెందిన ప్రభుత్వ టీచర్ రేపాల అశోక్‌కి డబ్బులు దొరికాయి. వాటిని ఆయన పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. డబ్బులు దొరికిన విషయంపై ఎస్‌ఐ సతీష్‌రెడ్డి బాధితురాలికి ఆదివారం సమాచారం అందించి డబ్బులను తిరిగి అప్పగించారు. నిజాయితీగా దొరికిన డబ్బులను అప్పగించిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు రేపాల అశోక్‌ను ఈ సందర్భంగా ఎస్‌ఐ సతీష్‌రెడ్డి శాలువాతో సత్కరించి అభినందించారు.



నగదు అప్పగిస్తున్న ఎస్‌ఐ, ఉపాధ్యాయుడు అశోక్

## హన్మాపురం సబ్‌స్టేషన్‌లో అగ్ని ప్రమాదం

- రూ.90లక్షల ఆస్తినష్టం

**భువనగిరి క్రైం :** మండలంలోని హన్మపురం విద్యుత్ సబ్ స్టేషన్‌లో శనివారం రాత్రి భారీ అగ్నిప్రమాదం సంభవించింది. అర్ధరాత్రి 12.30 గంటలకు సబ్ స్టేషన్‌లోని ఎంపీపీ ఫీడర్‌లో విద్యుత్ సరఫరా ట్రిప్ కావడంతో అందులో నుంచి మంటలు చెలరేగి దట్టమైన పొగలు వ్యాపించాయి. చూస్తుండగానే ఇంజన్ ఆయిల్‌లో పాటు కేబుల్ పూర్తిగా కాలిపోయింది. పక్కనే ఉన్న పరికరాలను రవాణా చేసే రెండు వాహనాలు కూడా పూర్తిగా కాలిపోయాయి. విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో అధికారులు సబ్ స్టేషన్‌కు ఫోన్ చేశారు. అక్కడ ఆపరేటర్ ఫీడర్ నుంచి పొగలు వస్తున్నాయని చెప్పడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వెంటనే అగ్నిమాపక కేంద్రం సిబ్బంది, రూరల్, పట్టణ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. రెండు ఫైర్ ఇంజన్ల సహకారంతో సుమారు నాలుగు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ప్రమాదంలో సుమారు రూ.90 లక్షల నష్టం వాటిల్లిందని అధికారులు అంచనా వేస్తున్నారు. సుమారు 35 సంవత్సరాల కాలం చెల్లిన ఫీడర్ కావడంతో అందులో నుంచి ఆయిల్ లీక్ కావడం వల్ల ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. ఆదివారం ఉదయం నుంచే అధికారులు సబ్ స్టేషన్ పునరుద్ధరణ పనులు అధికారులు చేపట్టారు.



సబ్ స్టేషన్‌లో ఎగిసిపడుతున్న మంటలు

## పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

- ఆర్థిక ఇబ్బందులే కారణం



అశోక్ (ఫైల్)

**కొండమల్లేపల్లి :** పురుగుల మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొండమల్లేపల్లి మండల పరిధిలోని జానుగానితండా గ్రామపంచాయతీలో ఆదివారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. జానుగానితండాకు చెందిన రమావత్‌కోట్య, ఝుంకా దంపతుల 2వ కుమారుడైన రమావత్ అశోక్(23)కు తొమ్మిది నెలల క్రితం తిరుమలగిరి సాగర్ మండలానికి చెందిన ఆంబోతు భీమ సరోజ దంపతుల కుమార్తె మౌనికను వివాహం చేసుకున్నాడు. అశోక్ కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. దీనికి తోడు భార్య పుట్టింటికి వెళ్లి 20 రోజుల నుంచి రాకపోవడంతో మానసికంగా కుంగిపోయాడు. ఈ క్రమంలోనే శనివారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన తండ్రి కోట్య అతడిని దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో అశోక్ మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామ్మూర్తి తెలిపారు. దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అశోక్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఆయన వెంట నాయకులు ఉట్కూరి వేమన్‌రెడ్డి, ఎంఏ.సిరాజ్ ఖాన్, దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, జాల నర్సింహారెడ్డి తదితరులున్నారు.

## గుప్త నిధుల కోసం తవ్వకాలు



గుడిబండ రోడ్డు వెంట తవ్వకాలు జరిపిన ప్రదేశం

**చిలుకూరు:** చిలుకూరు మండలం దూదియాతండా నుంచి గుడిబండ రోడ్డు వెంట పెద్ద కాలువ పక్కన గుర్తుతెలియని వ్యక్తులు గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపిన విషయం ఆదివారం వెలుగులోకి వచ్చింది. దూదియాతండా శివారులోని ఓ రైతు పొలంలో పురాతన హనుమాన్ దేవాలయం ఉంది. ఆ ఆలయం అడుగున గుప్త నిధులు ఉన్నట్లుగా పలువురు వ్యక్తులు ద్వారా తెలుసుకున్న రైతు శనివారం అర్ధరాత్రి క్షుద్ర పూజలు జరిపించినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. దేవాలయం పురాతన రాళ్లు తొలగించి తవ్వకాలు జరిపారు. ఉదయం పలువురు రైతులు అటుగా వెళ్లడంతో పూజలు, తవ్వకాలు జరిపిన ఆనవాళ్లు కనిపించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. వారికి బంగారం కూడా దొరికినట్లుగా గ్రామంలో చర్చ జరుగుతోంది. ఈ విషయంపై పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ జరపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# అంతర్ రాష్ట్ర దొంగ అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ నర్సింహులు

**పెద్దఅడిశర్లపల్లి :** తెలుగు రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర దొంగను గుడిపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ నర్సింహులు నిందితుడి వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లాకు చెందిన కత్తి రవికుమార్ కొన్నేళ్లుగా తాళాలు వేసిన ఇళ్లనే టార్గెట్‌గా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నాడు. రెండు రాష్ట్రాల్లో ఇతడిపై 34కేసులు నమోదయ్యాయి.

**జైలునుంచి విడుదలై..**

పలు కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చినా రవికుమార్ తీరు మాత్రం మారలేదు. గత సంవత్సరం డిసెంబర్‌లో జైలు నుంచి విడుదలైన రవికుమార్ మళ్లీ చోరీలు చేయడం ప్రారంభించాడు. ఈ నేపథ్యంలోనే గత నెల 18న అర్ధరాత్రి నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలంలోని రంగారెడ్డిగూడెం స్టేజీకి చెందిన గజ్జెల సుధాకర్‌రెడ్డి ఇంట్లోకి చొరబడి బీరువాలోని నగదు, బంగారం అపహరించుకుపోయాడు.

**వాహనాల తనిఖీలో..**

బాధితుడు గజ్జెల సుధాకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు గుడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆదివారం మండ కేంద్రంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో పెద్దవూర నుంచి కొండమల్లేపల్లి వైపు బైక్‌పై వెళ్తున్న రవీకుమార్ అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి విచారించారు. సుధాకర్‌రెడ్డి ఇంట్లో, పెద్దవూర మండలం లింగంపల్లిలో బైక్‌ను అపహరించింది తానేనని ఒప్పుకున్నాడు. నిందితుడి వద్ద బైక్‌ను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఎస్‌ఐ వివరించారు. కేసును ఛేదించిన కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ్య, ఎస్‌ఐ నర్సింహులు, ఐడీ పార్టీ సిబ్బంది హేమునాయక్,భాస్కర్,కొండల్‌లను దేవరకొండ డీఎస్పీ గిరిబాబు అభినందించారు.

### టీడీపీ ఎమ్మెల్యేకు తప్పిన ప్రమాదం

**సూర్యాపేట :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అద్దంకి టీడీపీ ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఆయన ఆదివారం కారులో హైదరాబాద్ వెళ్తుండగా సూర్యాపేట వద్ద బోల్తా పడింది. సేఫ్టీ బెలూన్లు ఓపెన్ కావడంతో ఎమ్మెల్యేకు ప్రమాదం తప్పింది. ఆయనను వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించారు.



# పూత, పిండె నిలిస్తేనే దిగుబడులు

- బత్తాయి సాగులో సరైన యాజమాన్యమే కీలకం
- అనుముల ప్రాంతీయ ఉద్యానవనశాఖ అధికారి మురళి

పాడి పంట

**గుర్రంపోడు :** నీటిఎద్దడి, ముదురుతున్న ఎండలతో బత్తాయి చెట్లకు పిందె విపరీతంగా రాలుతుండటం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. కొంత వరకు రాలడం సహజమేనైనా పూత, పిందె రాలుడు ఎక్కువై దిగుబడిలపై తీవ్ర ప్రభావం చూపేలా ఉందని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం చాలా వరకు బత్తాయి తోటలు పూత, పిందె దశల్లో ఉన్నాయి. పూత, పిందె రాలుడు నివారణకు అనుముల ప్రాంతీయ ఉద్యానవనశాఖ అధికారి మురళి అందిస్తున్న సూచనలు ఇలా ఉన్నాయి.

**నివారణ చర్యలు ఇలా**

- బత్తాయి తోటలు పూత, పిందె దశలో ఉన్నప్పుడు వేర్లు ఉన్న ప్రాంతాన్ని కదిలించరాదు. పాదులు తవ్వడం, దున్నడం ద్వారా వేర్లకు నష్టం కలుగుతుంది.
- పూత, పిందె దశల్లో క్రమపద్ధతిలో నీటి తడులివ్వాలి. బిందుసేద్యం ద్వారా ప్రస్తుత నెలలో కాపునిచ్చే తోటలకు రోజూ 150 లీటర్ల నీరు అందివ్వాలి. నీటి తడులు అందించడం ఎక్కువైనా, తక్కువైనా పూత, పిందె రాలుతుంది. పాదుల్లో ఎప్పుడూ గుగ్గిళ్ల పదును( చేతిలో మట్టిని పట్టుకుంటే ముద్ద కానిది) ఉండాలి. ఆలస్యంగా నీటి తడులిచ్చిన తోటల్లో అధిక వేడి వాతావరణంలో పూత, పిందె రాలుడు మార్చి, ఏప్రిల్ నెలాఖరు వరకు అవకాశం ఉంది. నీటి ఎద్దడి ఏర్పడకుండా డ్రిప్ ద్వారా క్రమ పద్ధతిలో నీరు అందించాలి.





విరగబూసిన బత్తాయి చెట్టు, (ఇన్‌సెట్‌లో) చెట్టు కింద రాలిన పిందెలు

- హార్మోన్ల పిచికారీలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. మందులు మోతాదు మించితే పూత, పిందె ఎక్కువగా రాలే ప్రమాదం ఉంది.
- ఆకులు చుట్టుకుని ఉండే పురుగుల వల్ల కూడా పూత, పిందె రాలుతుంది. వీటి నివారణకు ప్రోఫినోపాస్ తేదా కాన్ఫిడార్ ఒక మిల్లీలీటరు లీటర్ నీటికి చొప్పున కలిపి లేత ఇగురు పూతపై పిచికారీ చేయాలి.
- తొడిమకుళ్లు తెగులు వల్ల కూడా బఠాణీ గింజ సైజు నుంచి నిమ్మ కాయ సైజు వరకు కాయలు రాలిపోతుంటాయి. కాయపై తొడిమ దగ్గర పసుపు రంగులోకి మారి రాలిపోతుంటే రెండు గ్రాముల కార్బండిజమ్ మందును ఒక లీటరు నీటికి, లేదా రెండు గ్రాముల మాంకోజెబ్ లీటరు నీటికి, ఒక గ్రాము రెడోమిల్ ఒక లీటరు నీటికి చొప్పున కలిపి నెల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.
- సూక్ష్మదాతు లోపాలతో చెట్లు పల్లగా పసుపు రంగులోకి మారి ఉంటే కూడా పూత, పిందె నిలబడదు. చలికాలంలో చలి తీవ్రతకు సూక్ష్మదాతు లోపాలు బయటపడి తోటలు పసుపు రంగులోకి మారుతుండటం కన్పిస్తుంది. సేంద్రియ ఎరువులు ప్రతియేటా తప్పనిసరిగా రసాయన ఎరువులతో కలిపి వాడటం, తోటల మధ్యలో పచ్చిరొట్ట పంటలు సాగుచేసి భూమిలో కలియదున్నడం చేయడం ద్వారా చాల వరకు సూక్ష్మదాతు లోపాలు రాకుండా నివారించుకోవచ్చు.
- సూక్ష్మదాతువుల లోపాల నివారణకు జింక్ సల్ఫేట్ 5 గ్రాములు, మెగ్నిషియం సల్ఫేటు 2 గ్రాములు, ఫెర్రస్ సల్ఫేట్ 2 గ్రాములు, మాంగనీస్ సల్ఫేట్ 2 గ్రాములు, బోరాక్స్ 1 గ్రాము, సున్నం 6 గ్రాములు, యూరియా 10 గ్రాములు ఒక లీటరను నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. సుక్ష్మదాతు లోపాలు నివారిస్తేనే ఆశించిన దిగుబడులు వస్తాయి. ఈ పోషకాలను విడివిడిగా కొనుగోలు చేయడం ఎక్కువ ఖరీదుగా భావించే వారు మార్కెట్‌లో లభిస్తున్న బ్రాండెడ్ కంపెనీల ఫార్ములా -4తో ఉన్న సూక్ష్మపోషకాలను పిచికారీ చేసుకోవచ్చు.

- పూత, పిందె రాలుడు అరికట్టడానికి 2-4డి హార్మోన్ మందు 10 పి.పి.ఎం అంటే గ్రాము మందును 100 లీటర్ల నీటిలో లేదా ప్లానోఫిక్స్ హార్మోన్ మందు 1 మిల్లీ లీటర్ 5 లీటర్ల నీటిలో కలిపి పూత సమయంలో ఒక మారు, పిందె గోళికాయ సైజు ఉన్నప్పుడు ఇంకొక సారి పిచికారీ చేయాలి. ఈ హార్మోన్‌ల ఉత్ప్రేకరాలుగా పనిచేసి మొక్కల్లోని సుప్తావస్థను తొలగిస్తాయి. ఐతే హార్మోనులను నిర్ణీత మోతాదులోనే పిచికారీ చేయాలి. మోతాదు మించితే పూత, పిందె ఎక్కువగా రాలిపోవడమేగాక చెట్టు కూడా దెబ్బతింటుంది.